సాక్షి
జనగామ
శుక్రవారం । 5 । మే । 2023



'భగీరథ' నీటితో వ్యాపారం!

మిషన్ భగీరథ నీటితో వ్యాపారం చేసేందుకు లింగాలఘణపురం మండలం కళ్లెం సమీపంలో భారీ వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. - 8లో▸



క్రీస్తుసేవలో దేశానికే తలమానికం

ధర్మసాగర్ మండలం కరుణాపురంలో కొత్తగా నిర్మించిన క్రీస్తుజ్యోతి ప్రార్థనా మందిరాన్ని గురువారం దైవజనులు పాల్సన్‌రాజు, జయప్రకాశ్ ప్రారంభించారు. - 8లో▸

గరిష్టం/కనిష్టం
$33^0/25^0$

వాతావరణం

ఉదయం నుంచి ఆకాశం మేఘావృతమై చల్లని వాతావరణం ఉంటుంది. అక్కడక్కడా జల్లులు కురుస్తాయి. మధ్యాహ్నం సమయంలో సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి.

న్యూస్‌రీల్

సర్పంచ్‌కు కలెక్టర్ సన్మానం



లింగాలఘణపురం: జాతీయ స్థాయిలో ఉత్తమ పంచాయతీ అవార్డు అందుకున్న నెల్లుట్ల సర్పంచ్ చిట్ల స్వరూపరాణిభూపాల్‌రెడ్డిలను గురువారం కలెక్టర్ శివలింగయ్య, అదనపు కలెక్టర్ ప్రఫుల్‌దేశాయ్ సన్మానించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్రానికి దేశ వ్యాప్తంగా గుర్తింపు తెచ్చారని కొనియాడారు. పల్లెప్రకృతి వనంలో పండిన జపాన్ మామిడి, వాటర్ ఆపిల్ పండ్లను కలెక్టర్‌కు సర్పంచ్ స్వరూపరాణి ఈ సందర్భంగా అందజేశారు.

హజ్ యాత్రను విజయవంతంగా పూర్తి చేయాలి



జనగామ: ముస్లింలు హజ్ యాత్రను విజయవంతంగా పూర్తి చేయాలని హజ్ కమిటీ సెంట్రల్ ట్రైనర్ మజార్ ఖాస్మి అన్నారు. గురువారం పట్టణంలోని విజయ ఫంక్షన్ హాల్‌లో ముస్లింలకు ఒక్క రోజు శిక్షణ కార్యక్రమాన్ని ప్రొజెక్టర్ ద్వారా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హజ్ యాత్రకు వెళ్లే వారంతా అదృష్ట వంతులని, అల్లా ప్రత్యేక దువ్వా అందరికీ లభిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ మహమ్మద్ సమ్మద్, కోఆప్షన్ సభ్యుడు మసీ ఉర్ రెహమాన్, ఖాజా ముబ్తాహీద్, సొసైటీ అధ్యక్షుడు సర్వర్ మొహీనొద్దీన్, జిల్లా ఉపాధ్యక్షుడు అన్వర్ షరీష్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల సామగ్రి భద్రతకు చర్యలు తీసుకోవాలి



జనగామ: ఎన్నికల సామగ్రి భద్రతకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సీహెచ్.శివలింగయ్య అన్నారు. ఈ మేరకు కలెక్టరేట్ కార్యాలయ ప్రాంగణంలో ఎన్నికల సామగ్రి భద్ర పరిచిన గోదాంను ఆయన గురువారం అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్‌తో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పరిసరాలను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. కలెక్టర్ వెంట ఈఆర్వో ఇన్‌చార్జ్ మన్సూర్‌అలీ, తహసీల్దార్ రవీందర్, ఎన్నికల విభాగం తహసీల్దార్ గంగాభవాని తదితరులు ఉన్నారు.

హైందవ సమాజం ఏకం కావాలి



జనగామ: తిరుమలలో జరిగిన ఘటనలు పునరావృతం కాకుండా హైందవ సమాజం ఏకం కావాలని చాత్తాద శ్రీ వైష్ణవ సంఘం జిల్లా అధ్యక్షుడు కేశవపట్నం మధుసూదన్ అన్నారు. తిరుపతి తిరుచానూరులో భగవత్ రామానుజాచార్యుల జన్మదిన ఉత్సవాల శోభాయాత్రలో టీటీడీ విజిలెన్స్ అధికారుల తీరును నిరసిస్తూ జిల్లా చాత్తాద శ్రీ వైష్ణవ సంఘం ఆధ్వర్యంలో గురువారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఇందులో సంఘం బాధ్యులు ధర్మపురి శ్రీనివాస్, కృష్ణమూర్తి, రామాచారి, వెంకట విద్యాధర్, శ్యాంసుందర్, సత్యనారాయణ, తిరువాయిపాడి యతేంద్ర స్వామి, రామాంజనేయులు, శేశవపురి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆత్మరక్షణకు కరాటే దోహదం



పాలకుర్తి: విద్యార్థుల ఆత్మరక్షణకు కరాటే దోహదపడుతుందని వర్ధన్నపేట ఏసీపీ శ్రీనివాస్‌రావు అన్నారు. గురువారం వావిలాల గ్రామంలో మహాత్మా హెల్పింగ్ హ్యాండ్స్ ఆధ్వర్యంలో న్యూస్టార్ కుంగ్ ఫూ కరాటే ఉచిత శిక్షణ శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. వేసవి సెలవులను వృథా చేయకుండా విద్యార్థులు కరాటే నేర్చుకోవాలని అన్నారు. గంట రవీందర్, సర్పంచ్ గంట పద్మ భాస్కర్, ఎస్సై తాళ్ల శ్రీకాంత్, విద్యాశాఖ నోడల్ అధికారి యాకయ్య, ఎంపీటీసీ మానిక అశోక్, మాస్టర్ గుగ్గిళ్ల దేవేందర్, ఉప సర్పంచ్ కోల రాజు, ఎస్‌ఎంసీ చైర్మన్‌లు లింగయ్య, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సర్కారు స్కూళ్లకు మహర్దశ

- పీఎం శ్రీ' పథకం కింద జిల్లాలో 10 పాఠశాలల ఎంపిక
- రూ.45 లక్షల నుంచి రూ.కోటి వరకు నిధుల కేటాయింపు
- కార్పొరేట్ తరహాలో సదుపాయాలు, విద్యాబోధన

జనగామ రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన విద్యను కార్పొరేట్ తరహాలో అందించడానికి కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. ఇందుకు ప్రధాన మంత్రి స్కూల్ ఫర్ రైజింగ్ ఇండియా(పీఎం శ్రీ) పథకాన్ని ప్రవేశపెట్టింది. ఎంపికైన పాఠశాలల్లో మౌలిక వసతులు, నాణ్యమైన విద్య, పెరటి తోటలు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అందించడానికి పరికరాలు సమకూరుస్తారు. అర్హత గలిగిన పాఠశాలల జాబితా తీసుకున్న కేంద్రం ప్రమాణాల ప్రకారం ఎంపికైన పాఠశాలల జాబితాను వెల్లడించింది. జిల్లా వ్యాప్తంగా 10 పాఠశాలలను గుర్తించిన కేంద్రం.. మొదటి దశలో పాఠశాలల గుర్తింపు, రెండో దశలో లక్ష్యాల నిర్ధారణ, మూడో దశలో సహకారానికి చర్యలు తీసుకోనుంది. ఎంపికైన పాఠశాలలకు ఐదేళ్ల పాటు సుమారు రూ.45 లక్షల నుంచి రూ.కోటి వరకు నిధులు దశల వారీగా అందనున్నాయి.

ఎంపిక జరిగిందిలా..

మొదట జిల్లా స్థాయిలో పాఠశాలలను గుర్తించారు. నిబంధనల ప్రకారం అర్హత గలిగిన పాఠశాలల వివరాలు, విద్యార్థులు, ఉపాధ్యాయుల సంఖ్య, మౌలిక వసతులు, వనరుల కల్పనకు అవకాశాలను గుర్తించారు. జిల్లాలో 112 పాఠశాలలను గుర్తించి ప్రభుత్వానికి నివేదిక పంపించగా.. 62 ప్రమాణాలకు సంబంధించి 130 మార్కులు కేటాయించారు. అత్యధిక మార్కులు సాధించిన పాఠశాలలను ఎంపిక చేశారు.



'పీఎం శ్రీ' కింద ఎంపికైన చౌడారం మోడల్ స్కూల్

పథకం అమలు ఇలా..

ఈ పథకం కింద ఎంపికైన పాఠశాలల్లో ముఖ్యంగా క్రీడలు, సాంస్కృతిక ఎదుగుదల, నాణ్యమైన విద్య, ఆధునాతన సాంకేతికతను అందిపుచ్చుకోవడం, విద్యార్థులకు మానసిక స్వేచ్ఛ, తగిన విధంగా కౌన్సిలింగ్ ఇవ్వడం, దేశంపై సంపూర్ణ అవగాహన కల్పించడం, భాష పరమైన అవరోధాలను అధిగమించేందుకు అవసరమైన సాంకేతికతను అందుబాటులోకి తెస్తారు. సౌరవిద్యుత్, విద్యుత్ సేవలు, ఎల్‌ఈడీ దీపాల అమరిక, పోషకాహార తోటల పెంపకం, ప్లాస్టిక్ వస్తుల నిర్మూలన, నీటి సంరక్షణ, పర్యావరణ పరిరక్షణ, బొమ్మలతో బోధన తదితర సదుపాయాలు కల్పించి విద్యార్థులు ఏమేరకు సామర్థ్యాలు సాధించారనే విషయాన్ని మదింపు చేస్తారు. ఉపాధి అవకాశాల కల్పనపై అవగాహన కల్పిస్తారు.

ఎంపికైన స్కూళ్లు..

జిల్లా వ్యాప్తంగా 12 మండలాలు ఉండగా తొమ్మిది మండలాల పరిధిలో 10 పాఠశాలలను ఎంపిక చేశారు. అందులో జనగామ మున్సిపల్ పరిధి ధర్మకంచ ఉన్నత పాఠశాల, జనగామ మండలం చౌడారం మోడల్ స్కూల్, దేవరుప్పుల మండలం కోలుకొండ హైస్కూల్, రఘునాథపల్లి మండలం ఖిలాషాపురం జెడ్పీఎస్‌ఎస్, చిల్పూరు మండలం మల్కాపూర్ హైస్కూల్, కొడకండ్ల జెడ్పీఎస్‌ఎస్, స్టేషన్‌ఘన్‌పూర్ మోడల్ స్కూల్, పాలకుర్తి జెడ్పీఎస్‌ఎస్ జఫర్‌గఢ్ మండలం కూనూర్ జెడ్పీహెచ్‌ఎస్ ఉన్నాయి.

కార్పొరేట్‌కు దీటుగా వసతులు, బోధన



"నాలుగు నెలల క్రితం ప్రభుత్వానికి పాఠశాలల వివరాలు అందించాం. పీఎం శ్రీ పథకం కింద 10 పాఠశాలలను యూడైస్ ప్రకారం ఎంపిక చేశారు. వీటిలో నిబంధనల మేరకు అన్ని రకాల వసతులు కల్పిస్తాం. ఇందుకు మార్గదర్శకాలు రానున్నాయి. కార్పొరేట్ తరహాలో నాణ్యమైన విద్యాబోధన ఉంటుంది. ఈ పథకంతో విద్యాప్రమాణాలు మరింత మెరుగుపడనున్నాయి.

\- కె.రాము, జిల్లా విద్యాధికారి

తెలంగాణ సంస్కృతి పరిరక్షణకు కృషి

- రాష్ట్ర మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

దేవరుప్పుల: తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలను పరిరక్షించేందుకు సీఎం కేసీఆర్ ప్రత్యేకంగా కృషి చేస్తున్నారని రాష్ట్ర మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. గురువారం మండల కేంద్రంలో బొడ్రాయి పునఃప్రతిష్ఠాపన పూజలు, శ్రీ కంఠమహేశ్వరస్వామి ఆలయం, కమ్యూనిటీహాల్ ప్రారంభోత్సంతోపాటు గౌడసంఘం జలకడువ ర్యాలీలో ఆయన పాల్గొని ప్రసంగించారు. రాష్ట్ర వ్యాప్తంగా పురాతన ఆలయాల పునరుద్ధరణకు ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులు కేటాయిస్తోందని, ఈ దిశగా గ్రామాల్లో దేవాలయాల పునరుద్ధరణకు విరివిగా విరాళాలు ఇస్తున్న దాతలను అభినందించారు. అనంతరం ధర్మాపురం పరిధి సీత్యాతండాలో మృతి చెందిన కొవ్వానాయక్, లాకావత్‌తండాలో లావుడ్య నౌమిక్, కోలుకొండలో యామగాని యాదిగిరి కుటుంబాలను పరామర్శించారు.



ఆలయ ప్రారంభోత్సవంలో మంత్రి ఎర్రబెల్లి

వైస్‌ఎంపీపీ విజయ్‌కుమార్‌రెడ్డి, సర్పంచ్‌లు ఈదునూరి రమాదేవి నర్సింహారెడ్డి, కూర్నాల రవి, ఉపసర్పంచ్ దశరథం, ఎంపీటీసీ తోటకూరి రేణుక కిష్టయ్య, పూజారులు ఉప్పల రమేష్‌శర్మ, పెద్దాపురం వెంకటేశ్వరశర్మ, బీఆర్‌ఎస్ నాయకులు దయాకర్, రవి, గౌడ సంఘం అధ్యక్షుడు కారుపోతుల యాదగిరి, దాతలు బబ్బూరి శ్రీకాంగౌడ్, యేల సుందర్‌తోపాటు భిక్షపతి, వెంకన్నయాదవ్, అర్జున్‌గౌడ్, కృష్ణమూర్తి, ఉపేందర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

కరెన్సీ నోట్లపై అంబేడ్కర్ ఫొటో ముద్రించాలి



కేసీఆర్‌కు వినతిపత్రం ఇస్తున్న పరశురామ్

జనగామ రూరల్: కరెన్సీ నోట్లపై అంబేడ్కర్ ఫొటో ముద్రించాలని అంబేడ్కర్ ఫొటో సాధన సమితి జాతీయ అధ్యక్షుడు జేరిపోతుల పరశురామ్ సీఎం కేసీఆర్‌ను కోరారు. ఈ మేరకు అసెంబ్లీలో తీర్మానం చేసి పార్లమెంట్‌లో ఎంపీలతో మాట్లాడాలని గురువారం ఢిల్లీలోని ఎయిర్‌పోర్టు ఆవరణలో ముఖ్యమంత్రిని కలిసి వినతిపత్రం అందజేశారు.

హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో సీట్లు పెంచాలి



అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న ఉపేందర్

జనగామ: హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో ఎస్సీలకు జనాభా దామాషా ప్రకారం సీట్లు పెంచేలా కృషి చేయాలని మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి రాగళ్ల ఉపేందర్ కోరారు. ఈ మేరకు గురువారం జనగామ అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్‌కి వినతి పత్రం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ.. జిల్లాలో బెస్ట్ అవైలబుల్ స్కీమ్ కింద కార్పొరేట్ తరహాలో పాఠశాల, కళాశాలలో ఎస్సీ విద్యార్థులకు సీట్లు పెంచాలన్నారు. కార్యక్రమంలో జీడి రమేష్‌మాదిగ, కట్ట ప్రశాంత్‌మాదిగ, సుకన్య, రడపాక ఆదాం, అశోక్, చైతన్య, ప్రవంతి, శ్రావణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

31వరకు బీఆర్‌ఎస్ ఆత్మీయ సమావేశాలు

స్టేషన్‌ఘన్‌పూర్: నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ క్లస్టర్ల ఆత్మీయ సమావేశాలు ఈనెల 31 వరకు ఉంటాయని ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య తెలిపారు. స్థానిక క్యాంపు కార్యాలయంలో గురువారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ.. 12న కళ్లెం(లింగాలఘణపురం), 16న ఖిలాషాపూర్(రఘునాథపల్లి), 22న మీదికొండ(స్టేషన్‌ఘన్‌పూర్), 26న మల్కాపూర్(చిల్పూరు), 31న కరుణాపురం(ధర్మసాగర్)లో ఆత్మీయ సమావేశాలు ఉంటాయని చెప్పారు. ఇదిలా ఉండగా.. హన్మకొండ జిల్లా పరిధిలో శుక్రవారం జరిగే కార్యక్రమాలకు బీఆర్‌ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు, ఐటీ మంత్రి కేటీఆర్ హాజరవుతున్నారని, సేయింట్ గాబ్రియల్ స్కూల్‌లో నిర్వహించే బహిరంగ సభకు నియోజకవర్గం నుంచి పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు.



విలేకర్లతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజయ్య

కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ గుజ్జరి రాజు, ఘన్‌పూర్ సర్పంచ్ తాటికొండ సురేష్‌కుమార్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మాచర్ల గణేష్, జఫర్‌గఢ్ ఎంపీపీ రడపాక సుదర్శన్, జెడ్పీటీసీ ఇల్లందుల బేబీశ్రీనివాస్, నాయకులు ఎ.కుమార్, మనోజ్‌రెడ్డి, రంజిత్‌రెడ్డి, నాగరబోయిన శ్రీరాములు, ఎంపీటీసీలు రాజు, స్వరూపగణేష్, మారెపల్లి ప్రసాద్, తాటికొండ రమేష్, ఆకారపు అశోక్ పాల్గొన్నారు.

రైతులు అధైర్యపడొద్దు

- సివిల్ సప్లయ్ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ రవీందర్‌సింగ్

జఫర్‌గఢ్: ధాన్యం కొనుగోలు విషయంలో రైతులు అధైర్యపడొద్దు.. చివరి గింజవరకూ కొనుగోలు చేస్తామని సివిల్ సప్లయ్ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ రవీందర్ సింగ్ పేర్కొన్నారు. రైతులు చేసిన ఫోన్ కాల్‌తో స్పందించిన ఆయన.. సంబంధిత అధికారులతో కలసి మండల పరిధి కూనూర్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రైతులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. అధికారులు చెప్పిన విధంగా మిల్లర్లు ధాన్యం కొనుగోలు చేయకపోవడంతో ఇబ్బంది పడుతున్నామని రైతులు చైర్మన్‌కు వివరించగా.. సంబంధిత మిల్లు యజమానిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు చేయకుండా మిల్లర్లు రైతులను ఇబ్బందులకు గురిచేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో సివిల్ సప్లయ్ జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



కూనూర్ కొనుగోలు కేంద్రంలో రవీందర్‌సింగ్

ప్రజాధనం దుర్వినియోగం

- సీపీఎం పట్టణ కార్యదర్శి జోగు ప్రకాశ్

జనగామ: పట్టణంలో సుందరీకరణ పేరిట ప్రజాప్రతినిధులు, అధికార యంత్రాంగం ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారని సీపీఎం పట్టణ కార్యదర్శి జోగు ప్రకాశ్ అన్నారు. అంబేడ్కర్‌నగర్‌లో ప్రజలకు ఆహ్లాదకర వాతావరణం కల్పించడానికి ఏర్పాటుచేసిన పార్కు పశువుల కొట్టం, పందులకు అడ్డాగా మారడంతో గురువారం సీపీఎం నాయకులు సందర్శించి మాట్లాడారు. లక్షలాది రూపాయలు వెచ్చించి పార్కులో ఏర్పాటు చేసిన ఆట వస్తువులు మూన్నాళ్ల ముచ్చటగానే మిగిలిపోతున్నాయని విమర్శించారు. పార్కులు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాలుగా మారాయని, మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్ స్పందించి పార్కులను ప్రజలు వినియోగించుకునేలా తీర్చిదిద్దాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బాల్నెవెంకట మల్లయ్య, లింగం, వెంకటేష్, వినోద్, కళ్యాణ్, రాజు, కనకాచారి తదితరులు పాల్గొన్నారు.



పార్కును పరిశీలిస్తున్న ప్రకాశ్ తదితరులు

నేడు వరంగల్ నగరంలో మంత్రి కేటీఆర్ పర్యటన

- మధ్యాహ్నం 2.45 గంటల నుంచి రాత్రి వరకు కార్యక్రమాలు
- రూ.181.45 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు
- వరంగల్, హనుమకొండలలో పార్టీ కార్యకర్తలతో సమావేశాలు
- సాయంత్రం కాజీపేట సెయింట్ గాబ్రియల్ గ్రౌండ్స్‌లో భారీ బహిరంగసభ

సాక్షిప్రతినిధి, వరంగల్: రాష్ట్ర ఐటీ, పురపాలక, పరిశ్రమలశాఖ మంత్రి, బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు (కేటీఆర్) శుక్రవారం వరంగల్ నగరంలో పర్యటించనున్నారు. పలు అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆయన ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేయనున్నారు. ఈ మేరకు పార్టీ యంత్రాంగం, అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. గురువారం రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు హనుమకొండ ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్, క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కలెక్టర్లు, సీపీ, ఇతర శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. కేటీఆర్ పర్యటన సందర్భంగా మహానగరంలో బందోబస్తు, భద్రత ఏర్పాట్లను పోలీస్ కమిషనర్ ఏవీ రంగనాథ్ పర్యవేక్షించారు. కేటీఆర్‌కు ఘన స్వాగతం పలికేందుకు భారీగా ఏర్పాట్లు చేశారు. పార్టీ జెండాలు, స్వాగత తోరణాలు, బ్యానర్లతో హసన్‌పర్తి నుంచి మడికొండ వరకు రోడ్లన్నీ గులాబీమయమయ్యాయి.

ఏర్పాట్ల పరిశీలన..

కేటీఆర్ పాల్గొనే కార్యక్రమాల ఏర్పాట్లను గురువారం రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యే అరూరి రమేష్, సీపీ ఏవీ రంగనాథ్, కలెక్టర్‌లు సిక్తా పట్నాయక్, ప్రావీణ్య తదితరులు పరిశీలించారు. కిట్స్ కళాశాల, సమ్మయ్య నగర్ మోడల్ వైకుంఠధామం, సైన్స్ సెంటర్, ఫాతిమా నగర్‌లోని సమావేశ స్థలాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.



కేటీఆర్ పర్యటన ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రి దయాకర్‌రావు, వినయ్, కలెక్టర్లు, తదితరులు

కేటీఆర్ పర్యటన ఇలా..

- శుక్రవారం మధ్యాహ్నం 2.45గంటలకు హుస్నాబాద్ నుంచి హెలికాప్టర్ ద్వారా హసన్‌పర్తి కిట్స్ కళాశాల ఆవరణకు చేరుకుంటారు.
- 2–45 నుంచి 4–30 వరకు ఆ కళాశాలలో ఇంక్యుబేషన్ సెంటర్‌ను ప్రారంభించి ఎగ్జిబిట్లను పరిశీలిస్తారు, హెచ్‌ఓడీలు, విద్యార్థులతో ఇంటరాక్షన్, కేసీఆర్ కప్ ప్రదానోత్సవం ఉంటుంది.
- 4.30 గంటలకు హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యక్రమంలో పాల్గొంటారు.
- సాయంత్రం 5 గంటలకు లష్కర్ బజార్‌లోని ప్రభుత్వ స్కూల్లో సైన్స్‌పార్క్ ప్రారంభం, పలు అభివృద్ధి /ఐటీ శంకుస్థాపనలు చేస్తారు.
- 5.30 గంటలకు వరంగల్ నాయుడు పెట్రోల్ పంప్ వద్ద పార్టీ కార్యకర్తలతో సమావేశం
- 6 గంటలకు హనుమకొండ ఇందిరానగర్‌లోని రాష్ట్ర రైతు రుణ విమోచన కమిషన్ చైర్మన్ నాగుర్ల వెంకన్న ఇంటికి చేరుకుంటారు.
- 6.15 గంటలకు నగరంలోని 57వ డివిజన్ గాంధీనగర్‌లోని మోడల్ వైకుంఠధామం ప్రారంభోత్సవం
- 6.30 గంటలకు సెయింట్ గాబ్రియల్ స్కూల్ మైదానంలో బహిరంగ సభ
- రాత్రి 8.00 గంటలకు రోడ్డుమార్గాన హైదరాబాద్‌కు బయలుదేరుతారు.

ఇక ప్రతినెలా ఫోర్టిఫైడ్ రైస్

- పోషకాల లోపం నివారణే లక్ష్యం
- ఈనెల నుంచే రేషన్ షాపుల్లో పంపిణీ
- జిల్లాలో 1,61,239 మంది లబ్ధిదారులు

జనగామ రూరల్: పేద ప్రజలకు పోషకాహార లోపాన్ని నివారించడానికి చౌక ధరల దుకాణాల ద్వారా బలవర్ధకమైన(ఫోర్టిఫైడ్) బియ్యం సరఫరా చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈనెల నుంచే రేషన్ షాపుల ద్వారా పంపిణీ చేయడానికి సంబంధిత అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లాలోని రైస్ మిల్లుల్లో పోషక విలువలు కలిగిన రైస్ తయారు చేస్తున్నారు. వీటిని జిల్లాలోని 335 రేషన్ షాపుల ద్వారా 1,61,239 మంది లబ్ధిదారులకు పంపిణీ చేయనున్నారు.

ఇవీ ప్రత్యేకతలు..

158 గ్రాముల సాధారణ బియ్యంలో 45 గ్రాముల కార్బోహైడ్రేట్స్, 4.3 గ్రాముల ప్రొటీన్, 0.6 గ్రాముల ఫైబర్, 0.4 గ్రాముల మాంసకృత్తులు ఉంటాయి. ఫోర్టిఫైడ్ రైస్‌లో విటమిన్, మినరల్స్ కృత్రిమ ఐరన్, సోడియం ఫోలిక్ యాసిడ్, మిటవిన్‌లు ఏ, బీ1, బీ2, బీ3, బీ6, బీ9, బీ12, డీ, ఈ వాటిని తగు మోతాదులో మిశ్రమాలను కలిపి పంపిణీ చేయనున్నారు.



ఫోర్టిఫైడ్ రైస్ వివరాల పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్

తయారీ ఇలా..

వంద కిలోల బియ్యానికి ఒక కిలో పోషకాల బియ్యం కెర్నల్ కలుపుతారు. ఇందులో ఐరన్ 28 మిల్లీ గ్రాముల నుంచి 42.5 మిల్లీ గ్రాములు, సోడియం ఐరన్ 14 మిల్లీ గ్రాముల నుంచి 21.25 మిల్లీ గ్రాములు, ఫోలిక్ యాసిడ్ 75 మైక్రోగ్రాముల నుంచి 125 మైక్రో గ్రాములు కలుపుతారు. అలాగే విటమిన్ బీ12 0.75 మైక్రో గ్రాములు కలుపడం ద్వారా జీవక్రియలకు అవసరమైన విటమిన్లు అందించే ప్రయత్నం చేస్తున్నారు. తద్వారా ప్రజలు రోగాల బారిన పడకుండా ముందస్తు నివారణలో భాగంగా ఈ బియ్యం అందిచనున్నారు. వీటిని గుర్తించడానికి బియ్యం బ్యాగులపై ఫోర్టిఫైడ్ రైస్ అని తప్పనిసరిగా గుర్తులు వేస్తారు.

పంపిణీకి ఏర్పాట్లు చేస్తున్నాం..

"ప్రజలకు పోషకాహార లోపం రాకుండా ప్రభుత్వం ఫోర్టిఫైడ్ రైస్ అందించడానికి సిద్ధమైంది. జిల్లాలో 335 రేషన్ షాపుల ద్వారా సరఫరా చేయడానికి అవసరమైన ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించాం. అన్ని రకాల పోషక విలువలు కలిగిన ఈ బియ్యంతో ప్రజలకు ఎంతో ప్రయోజనం చేకూరనుంది.

\- సీహెచ్.శివలింగయ్య, కలెక్టర్

వైభవంగా నృసింహుడి కల్యాణం



ఉత్సవ విగ్రహాలతో ఊరేగింపుగా వస్తూ..

- 'బండగుట్ట' స్వామికి పట్టు వస్త్రం నేసి సమర్పించిన పద్మశాలీలు

లింగాలఘణపురం: మండల పరిధి బండ్లగూడెంలో బండగుట్ట లక్ష్మీనర్సింహస్వామి కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. గురువారం ఉదయం సంప్రదాయం ప్రకారం మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయం నుంచి ఉత్సవ విగ్రహాలను ట్రాక్టర్‌లో ఊరేగింపుగా బండ్లగూడెంలోని బండగుట్టపై ఉన్న ఆలయం వేదిక వద్దకు తీసుకువచ్చారు. వేద పండితులు కృష్ణమాచార్యుల ఆధ్వర్యంలో కల్యాణం నిర్వహించారు. పుణ్యదంపతులు పెళ్లిపెద్దలుగా వ్యవహరించారు. వంచ మహేశ్వర్‌రెడ్డి, రాంరెడ్డి కల్యాణోత్సవ ఏర్పాట్లు చేయగా.. పోరెడ్డి మల్లారెడ్డి భక్తులకు అన్నదానం చేశారు. జిల్లా పంచాయతీ అధికారి రంగాచారి దంపతులు కల్యాణోత్సంలో పాల్గొన్నారు.

ట్రాక్టర్‌లో మగ్గంపై పట్టు వస్త్రం నేసి..

ప్రతి ఏడాది కల్యాణోత్సవంలో పద్మశాలీలు ఆనవాయితీగా పట్టు వస్త్రం నేసి స్వామివారికి సమర్పిస్తారు. ట్రాక్టర్‌లో మగ్గం ఏర్పాటు చేసి ఉత్సవ విగ్రహాల ఊరేగింపులో ముందుకు సాగుతూ.. బింగి స్వామి, వంగ ఉప్పలయ్య, నాగభూషణం, అంజనేయులు, సత్యనారాయణ, రమేష్ పట్టు వస్త్రం నేసి స్వామివారికి సమర్పించారు. ఆయా కార్యక్రమాల్లో సర్పంచ్‌లు విజయ్‌మనోహర్, విజయకుమార్, ఎంపీటీసీ భిక్షపతి, నాయకులు దీపక్‌రెడ్డి, సింధు తదితరులు పాల్గొన్నారు.



బండగుట్టపై కల్యాణం..



ట్రాక్టర్‌పై మగ్గం మీద వస్త్రం తయారు చేస్తూ..

సోమేశ్వరాలయంలో..



కల్యాణం నిర్వహిస్తున్న పండితులు

పాలకుర్తి టౌన్: నరసింహస్వామి జయంతి సందర్భంగా గురువారం పట్టణంలోని శ్రీసోమేశ్వర లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలతో పాటు స్వామి వారికి కల్యాణం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలిరాగా ఏర్పాట్లను ఆలయ ఈఓ భాగం లక్ష్మీప్రసన్న, చైర్మన్ వెనుక దాసుల రామచంద్రయ్యశర్మ పర్యవేక్షించారు. అర్చకులు దేవగిరి రామన్న, లక్ష్మన్న, డీవీఆర్. శర్మ, అనిల్‌కుమార్, మత్తగజం నాగరాజు, ధర్మకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కాజీపేట జంక్షన్‌లో రైల్వే సేఫ్టీ ఆఫీసర్ తనిఖీలు

కాజీపేట రూరల్: కాజీపేట జంక్షన్‌లో గురువారం దక్షిణ మధ్య రైల్వే చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ (సీఎస్ఓ) రవీంద్రనాథ్‌రెడ్డి తనిఖీలు చేపట్టారు. రైల్వే డ్రైవర్ల కార్యాలయం, డ్రైవర్ల విశ్రాంతి కార్యాలయం, డిప్యూటీ స్టేషన్ మాస్టర్ కార్యాలయాన్ని ఆయన తనిఖీ చేశారు. అనంతరం రైల్వే యార్డులో రైలు ప్రమాదాలు జరిగితే యుద్ధప్రాతిపదికన తరలివెళ్లే యాక్సిడెంట్ రిలీఫ్ ట్రైన్, ఎంఆర్‌వీ ట్రైన్‌ను సందర్శించి అందులోని అన్ని యంత్ర సామగ్రి, పరికరాలు సక్రమంగా ఉన్నాయా? లేదా అని పరిశీలించి తెలుసుకున్నారు. అనంతరం కాజీపేట రైల్వే అధికారులతో పలు విషయాలపై చర్చించారు. కార్యక్రమంలో కాజీపేటకు చెందిన వివిధ రైల్వే విభాగాల అధికారులు పాల్గొన్నారు.

రేపు విజ్ఞానోత్సవ్

కేయూ క్యాంపస్: హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్‌అండ్ సైన్స్ కళాశాలలో ఈనెల 6న కళాశాల విజ్ఞానోత్సవ్–23ను నిర్వహించనున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య బన్న అయిలయ్య గురువారం తెలిపారు. ఆడిటోరియంలో నిర్వహించే ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా కేయూ వీసీ తాటికొండ రమేశ్, శాసనమండలి సభ్యుడు దేశపతి శ్రీనివాస్, హనుమకొండ కలెక్టర్ సిక్తా పట్నాయక్, వరంగ్ కలెక్టర్ పి.ప్రావీణ్య, కేయూ రిజిస్ట్రార్ టి.శ్రీనివాస్‌రావు, ద్రోణాచార్య అవార్డు గ్రహీత నాగపురి రమేశ్, గాయకుడు జయరాజ్, బలగం సినిమా నటుడు అరసం మధుసూదన్ పాల్గొననున్నట్లు పేర్కొన్నారు.

ప్రీ పీహెచ్‌డీ పరీక్షల ఫీజు చెల్లించాలి

కేయూ క్యాంపస్: కేయూలోని వివిధ విభాగాల పరిశోధకులు ప్రీ పీహెచ్‌డీ పరీక్ష ఫీజు చెల్లించేందుకు గురువారం నోటిఫికేషన్ విడుదల చేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య పి.మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఎస్.జ్యోతి తెలిపారు. ఫీజు రూ.930 అని, అపరాధ రుసుము లేకుండా ఈ నెల16వ తేదీ వరకు పరీక్ష ఫీజు చెల్లించుకోవచ్చని పేర్కొన్నారు.

‘భగీరథ’ నీటితో వ్యాపారం!

- కల్లెం సమీపంలో భారీ వాటర్ ప్లాంట్
- రోజుకు లక్ష లీటర్ల నీళ్ల అనుమతికి దరఖాస్తు
- పరిశ్రమల నిబంధన పేరుతో వాటర్ బాటిళ్ల తయారీ కంపెనీకి అనుమతులు?


కల్లెం సమీపంలో ఏర్పాటు చేసిన భారీ వాటర్ ప్లాంట్

లింగాలఘణపురం: ప్రభుత్వం ఇంటింటికీ శుద్ధి చేసిన తాగునీరు అందించాలనే లక్ష్యంతో మిషన్ భగీరథను ప్రారంభించింది. ఈ నీటితో వ్యాపారం చేసేందుకు లింగాలఘణపురం మండలం కల్లెం సమీపంలో భారీ వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. రోజుకు లక్ష లీటర్ల నీటిని తీసుకునేందుకు అనుమతి కోసం రూ.26 లక్షలు చెల్లించి దరఖాస్తు చేసుకున్నారు. వేసవిలో చుట్టుపక్కల గ్రామాల ప్రజలు తాగునీటికి తిప్పలు పడుతున్న నేపథ్యంలో వాటర్ బాటిళ్ల తయారు చేసుకునేందుకు రోజుకు లక్ష లీటర్ల నీటిని ఇచ్చేందుకు అధికార యంత్రాంగం సిద్ధమవుతోంది. లక్షలాది రూపాయలు ఖర్చు చేసి పూర్తి స్థాయిలో శుద్ధి చేసి నీటిలో ఉండాల్సిన లవణాల శాతం(టీడీఎస్)ను తీసుకొచ్చి నేరుగా ప్రజలు తాగేందుకు సిద్ధమైన నీటిని వాటర్ బాటిళ్ల తయారీ కంపెనీకి అమ్మడమేంటో అర్థం కావట్లేదు.

బోర్లలో సరిపడా నీళ్లు రాక..

ఈభారీ వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసేందుకు సదరు కంపెనీ యాజమాన్యం స్థలాన్ని కొనుగోలు చేసి అందులో బోర్లు వేసింది. నీళ్లు సరిగ్గా పడకపోవడంతో మిషన్ భగీరథ నీటి కోసం దరఖాస్తు చేసుకుంది. నిర్వాహకులు అందుకు సంబంధించిన పైపులైన్‌లు కూడా వేసుకున్నారు. ప్రభుత్వం నుంచి అనుమతి రాగానే.. రోజుకు లక్ష లీటర్ల నీరు తీసుకునేందుకు అక్కడే మీటర్లను బిగించి ఓ వ్యక్తిని కూడా నియమించినట్లు సమాచారం.

పరిశ్రమలకు పది శాతమే అనుమతి..

మిషన్ భగీరథ నీటిలో పది శాతం పరిశ్రమలకు ఇచ్చేందుకు అనుమతి ఉందనే నిబంధనపై వాటర్ ప్లాంట్‌కు రోజూ లక్ష లీటర్లు ఇచ్చేందుకు దరఖాస్తు చేసుకున్నారు. పరిశ్రమలంటే ఏదైనా ఉత్పత్తి రంగానికి సంబంధించిన ఫ్యాక్టరీ అయ్యి ఉండాలి. ఇక్కడ మాత్రం కేవలం వాటర్ బాటిళ్లు తయారు చేసే కంపెనీలకు మిషన్ భగీరథ నీరు అనుమతి ఇవ్వొచ్చా? అనే అంశం చర్చనీయాంశమైంది. పూర్తి స్థాయిలో శుద్ధి చేయబడి ఉండాల్సిన మినరల్స్ శాతం (టీడీఎస్) నీటిని సదరు కంపెనీ తీసుకొని అందులో మరిన్ని మినరల్స్ కలిపి వాటర్ బాటిళ్లను తయారు చేసి అమ్ముకోనుంది. ప్రభుత్వ అనుమతి కోసం ఎదురు చూస్తోంది.

ఆదాయం పెంచుకునేందుకు..

నిబంధన మేరకు ఇప్పటికే సదరు కంపెనీ యాజమాన్యం రోజూ లక్ష లీటర్ల నీటికి దరఖాస్తు చేసుకుంది. వెయ్యి లీటర్లకు రూ.90ల చొప్పున నీటిని ఇచ్చేందుకు ప్రభుత్వం నుంచి అనుమతికి ప్రతిపాదనలు పంపించాం. రాగానే.. అక్కడే మీటరు బిగించి ఇవ్వడం జరుగుతుంది.

- వి.శ్రీనివాసులు, ఈఈ, మిషన్ భగీరథ

నిబంధనల మేరకు దరఖాస్తు చేసుకున్నాం..

నిబంధనల మేరకే మిషన్ భగీరథ నీటికి దరఖాస్తు చేసుకున్నాం. అందుకు సంబంధించి రూ.26 లక్షలు చెల్లించడం జరిగింది. దీనికి సంబంధించి ప్రభుత్వం నుంచి అనుమతి రాగానే.. నీటిని తీసుకుంటాం. భగీరథ నీటిలో మరిన్ని మినరల్స్ యాడ్ చేసి బాటిళ్లు తయారు చేయడం జరుగుతుంది.

- శ్రీనివాస్‌రెడ్డి, కంపెనీ మేనేజర్

నూతన జిల్లాల వారీగా ఖాతాల బదిలీ

హన్మకొండ: పరిపాలన సౌలభ్యానికి జిల్లాల పునర్విభజన, నూతన జిల్లాల ఏర్పాటుతో బోధన, బోధనేతర ఉద్యోగుల నూతన జిల్లాల కేటాయింపు ప్రక్రియ జరిగింది. పూర్వ వరంగల్ జిల్లా స్థాయిలో జిల్లా ప్రజాపరిషత్ ఉపాధ్యాయులు, ఉద్యోగుల జీపీఎఫ్ ఖాతాలు పూర్వ వరంగల్ జెడ్పీలో నిర్వహించారు. జిల్లాల పునర్విభజన జరిగినా పూర్వ జెడ్పీ స్థాయి నూడల్ జెడ్పీగా హనుమకొండ జెడ్పీ ఇప్పటి వరకు జీపీఎఫ్ ఖాతాల నిర్వహణ చూస్తోంది. నూతన జిల్లాల ఏర్పాటు ఉపాధ్యాయులు, ఉద్యోగుల కేటాయింపులు పూర్తి కావడంతో వారి సౌలభ్యం కోసం జిల్లాల వారీగా ఖాతాల విభజన చేపట్టారు. 10 ప్రత్యేక టీమ్‌లు ఏర్పాటు చేసి ఖాతాల విభజన ప్రక్రియ చేపట్టారు. నోడల్ సీఈఓ, హనుమకొండ జెడ్పీ సీఈఓ వెంకటేశ్వర్ రావు ఒక్కో టీమ్‌కు ఇద్దరు చొప్పున 10 టీమ్‌లు ఏర్పాటు చేశారు. ఈటీమ్‌లు నూతన జిల్లాల్లోని ఉపాధ్యాయులు, ఉద్యోగుల వారీగా ఖాతాల బదిలీ ప్రక్రియను చేపట్టారు. రెండు నెలల్లో ఈప్రక్రియను పూర్తి చేయనున్నారు. పూర్వ వరంగల్ జిల్లాలో 8,150 బోధన, బోధనేతర సిబ్బంది ఉన్నారు. వీరి జీపీఎఫ్ ఖాతాలను జూన్ 30 వరకు నూతన జిల్లాలకు బదిలీ చేస్తారు. నూతన జిల్లాల వారీగా ప్రస్తుతం హనుమకొండ జిల్లాలో 1,679 మంది, వరంగల్‌లో 1,912, జనగామలో 1,827, మహబూబాబాద్‌లో 1,827, జేఎస్ భూపాలపల్లిలో 489, ములుగులో 476, సిద్దిపేట జిల్లాలో 294 సిబ్బంది ఉన్నారు.

లావాదేవీల నిలిపివేత

నూతన జిల్లాల వారీగా జీపీఎఫ్ ఖాతాల విభజన ప్రక్రియ పూర్తయ్యే వరకు లావాదేవీలు పూర్తిగా నిలిపేశాం. ఈనెల 1 నుంచి జూన్ 30 వరకు జీపీఎఫ్ పార్ట్ ఫైనల్, రుణాలు, అడ్వాన్స్‌లకు దరఖాస్తుల స్వీకరణ నిలిపివేశారు. ఉపాధ్యాయులు, ఉద్యోగులు సహకరించాలి.

- వెంకటేశ్వర్ రావు, జెడ్పీ సీఈఓ, హనుమకొండ

వృద్ధురాలిపై హత్యాయత్నం

- పరిస్థితి విషమం

కురవి: ఇద్దరు వృద్ధులు సహజీవనం చేస్తున్నారు. పది రోజుల నుంచి ఇద్దరికీ గొడవలు జరుగుతున్నాయి. కోపంతో 70 ఏళ్ల షేక్ ఖాజామియా అతడితో సహజీవనం చేస్తున్న 60 ఏళ్ల గుండగాని మంగమ్మని రోకలి బండతో తలపై మోది హత్యాయత్నం చేసిన ఘటన మహబూబాబాద్ జిల్లా కురవి మండలం తట్టుపల్లిలో బుధవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. ఎస్సై బి.రాము తెలిపిన వివరాల ప్రకారం.. తట్టుపల్లికి చెందిన గుండగాని మంగమ్మ 30 ఏళ్ల నుంచి అదే గ్రామానికి చెందిన షేక్ ఖాజామియాతో ఒకేఇంట్లో సహ జీవనం చేస్తోంది. కొన్ని నెలల నుంచి ఇద్దరి మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. మంగమ్మ తనకు కళ్లు కనిపించడంలేదని, తన బిడ్డల వద్దకు వెళ్తానని ఖాజామియాతో చెప్పింది. దీంతో ఖాజామియా ఈసమయంలో తనను ఎవరు చూసుకుంటారని ఆమెతో గొడవకు దిగాడు. అయితే కొద్దిరోజుల క్రితం ఖాజామియా కొడుకులు వచ్చి ఇద్దరికీ సర్దిచెప్పారు. దీంతో ఖాజామియా ఆమెపై కోపంతో బుధవారం రాత్రి రోకలిబండతో తలమీద మోదాడు. దీంతో ఆమె తల పగిలిపోయింది. వెంటనే మహబూబాబాద్ జనరల్ ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స చేశారు. అదే రాత్రి వరంగల్ ఎంజీఎంకు తరలించారు. ఆమె పరిస్థితి విషమంగా ఉంది. మంగమ్మ కుమార్తె రాంపల్లి రేణుక ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

అప్పుల బాధతో మహిళ ఆత్మహత్య

పెద్దవంగర: అప్పుల బాధతో వరంగల్ జిల్లా రాయపర్తి మండలం మైలారం గ్రామానికి చెందిన జక్కుల మంజుల(40) బుధవారం రాత్రి ఆత్మహత్య చేసుకుంది. పెద్దవంగర మండలంలోని పోచంపల్లి గ్రామానికి చెందిన మంజులకు ఇరవై ఏళ్ల క్రితం మైలారం గ్రామానికి చెందిన శ్రీనుతో వివాహం జరిగింది. వీరికి ఒక కూమారుడు, కుమార్తె. బ్రెయిన్ ట్యూమర్‌తో భర్త మూడేళ్ల క్రితం మృతి చెందాడు. భర్త చికిత్స సమయంలో మంజుల రూ. 3 లక్షల వరకు అప్పు చేసింది. తీసుకున్న అప్పులకు వడ్డీ పెరుగుతుండడం, కుటుంబ పోషణ భారమవడంతో మంజుల మనస్తాపం చెందింది. బుధవారం పుట్టింటికి వచ్చి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి కొడుకు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై రాజు తెలిపారు.

విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి


యాకు (ఫైల్)

చిన్నగూడూరు: విద్యుత్ షాక్‌తో మహబూబాబాద్ జిల్లా చిన్నగూడూరు మండలం తుమ్మల చెరువు తండా శివారు మల్యా తండాకు చెందిన మాలోత్ యాకు(42) గురువారం మృతి చెందాడు. యాకు వ్యవసాయం చేస్తుంటాడు. గురువారం తన ఇంటి మోటారు మరమ్మతు చేసే సమయంలో ప్రమాదవశాత్తు కరెంట్ షాక్‌కు గురై మృతి చెందాడు. స్థానిక ఎస్సై సంతోశ్‌కుమార్ ఘటనాస్థలిని పరిశీలించి కేసు నమోదు చేసుకున్నారు. ఎమ్మెల్యే రెడ్యానాయక్ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. బాధితకుటుంబానికి సానుభూతి తెలిపారు.

జ్వరంతో వ్యక్తి ..


రామ్‌కుమార్ (ఫైల్)

వాజేడు: జ్వరంతో బాధపడుతూ మండలంలోని కొంగాల గ్రామానికి చెందిన యాలం రామ్‌కుమార్(40) గురువారం మృతి చెందాడు. రామ్‌కుమార్ వారం నుంచి జ్వరంతో బాధపడుతున్నాడు. మందులు వాడడంతో జ్వరం తగ్గిందని భావించాడు. ఛత్తీస్‌గఢ్‌లో బంధువుల ఇంట్లో జరిగిన పెళ్లికి వెళ్లి మూడ్రోజుల క్రితం ఇంటికి వచ్చాడు. బుధవారం రాత్రి అతడికి మళ్లీ జ్వరం వచ్చింది. గమనించిన బంధువులు భద్రాచలం ప్రైవేట్ వైద్యశాలకు తీసుకెళ్లారు. వైద్యం చేస్తుండగానే రామ్‌కుమార్ మృతి చెందాడు.

అదనపు కట్నం కోసం వేధించిన ఒకరిపై కేసు

చెన్నారావుపేట: అదనపు కట్నం కోసం వేధించిన ఒకరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తోట మహేందర్ గురువారం తెలిపారు. మండలంలోని తిమ్మారాయినిపహడ్ గ్రామానికి చెందిన దొనికేని స్వాతికి మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేట మండలంలోని కొమ్ములవంచకు చెందిన దొనికేని యాకయ్యతో 2012లో వివాహం జరిగింది. అప్పటి నుంచి యాకయ్యతో పాటు ఆయన కుటుంబ సభ్యులు అదనపు కట్నం తీసుకురావాలని స్వాతిని వేధింపులకు గురిచేస్తున్నారు. ఈవిషయంపై బాధితురాలు స్వాతి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

శిశువును విక్రయించేందుకు యత్నం

- ఒకరిపై కేసు

రాయపర్తి: ఐదురోజుల ఆడ శిశువును విక్రయించేందుకు ప్రయత్నించిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు గురువారం స్థానిక ఎస్సై బండారి రాజు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని సన్నూరు గ్రామానికి చెందిన గడ్డమీది యాకమల్లు ఓ మహిళతో వివాహేతర సంబంధాన్ని కొనసాగిస్తున్నాడు. ఆ మహిళ ఐదు రోజుల క్రితం ఆడ శిశువుకు జన్మనిచ్చింది. యాకమల్లుకు ఇప్పటికే ఆడపిల్లలు ఉండడంతో శిశువును గురువారం విక్రయించేందుకు ప్రయత్నిస్తూ గ్రామ శివారులో కనిపించాడు. సమాచారం అందుకున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మోదె మాధవితోపాటు, అంగన్‌వాడీ టీచర్ జ్యోతి కలిసి ఘటనా స్థలికి వెళ్లి శిశువును తల్లికి అప్పగించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మాధవీలత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

మోరంచ వాగులో వ్యక్తి గల్లంతు


వెంకటేశ్ (ఫైల్)

చిట్యాల: జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలం నైన్‌పాక గ్రామ శివారులో ఉన్న మోరంచ వాగును దాటుతూ ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు అందులో పడి గల్లంతయ్యాడు. ఈఘటన ఆలస్యంగా గురువారం వెలుగులోకి వచ్చింది. ఎస్సై గుర్రం కృష్ణప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. ఉమ్మడి కరీంనగర్ జిల్లా గోదావరిఖని విఠల్‌నగర్‌కు చెందిన కేతిరి వెంకటేశ్(30) ఈనెల 1న తన అత్తగారి గ్రామమైన గుడాడ్‌పల్లికి వెళ్తుండగా నైన్‌పాక శివారులో ఉన్న మోరంచపల్లి వాగు దాటుతూ ప్రమాదవశాత్తు అందులో పడిపోయాడు. అతడి ఆచూకీ కోసం పోలీసులు మోరంచ పరిసరాల్లో గాలించినా ఫలితం లేదు. వెంకటేశ్ తండ్రి సమ్మయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై గుర్రం కృష్ణప్రసాద్ తెలిపారు. వెంకటేశ్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

క్రీస్తు సేవలో దేశానికే తలమానికం


చర్చి ప్రారంభానికి వచ్చిన విశ్వాసులు


మందిరాన్ని ప్రారంభిస్తున్న దైవజనులు

ధర్మసాగర్: ఏసు క్రీస్తు ప్రార్థన మందిరం క్రీస్తు సేవలో దేశానికే తలమానికంగా నిలుస్తోందని కరుణాపురం క్రీస్తుజ్యోతి ప్రార్థన మందిరం వ్యవస్థాపకులు రెవరెండ్ డాక్టర్ సంగాల పాల్సన్‌రాజ్, రెవరెండ్ డాక్టర్ గోపు జయప్రకాశ్ అన్నారు. ధర్మసాగర్ మండలం కరుణాపురంలో నిర్మించిన క్రీస్తు జ్యోతి ప్రార్థన మందిరాన్ని గురువారం దైవజనులు పాల్సన్‌రాజ్, జయప్రకాశ్ కలిసి ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆసియా ఖండంలో అతిపెద్ద చర్చిని కరుణాపురంలో నిర్మించడం దేవుని ప్రార్థన సంకల్పమేనన్నారు. జీవితాంతం దేవుడి సేవలో కొనసాగుతామన్నారు. యూఎస్ఏ ఇంటర్నేషనల్ స్పీకర్ రెవరెండ్ డాక్టర్ స్టీవ్ మున్సే బైబిల్ సందేశం ఇచ్చారు. పాల్సన్‌రాజ్, జయప్రకాశ్‌లు ప్రత్యేక వాహనంపై కేరళ బ్యాండ్ బృందంతో పోలీసుల బందోబస్తు, క్రీస్తు విశ్వాసులతో తమ ఇంటి నుంచి కరుణాపురం పురవీధుల మీదుగా క్రీస్తుజ్యోతి ప్రార్థనా మందిరానికి చేరుకొని క్రీస్తు జెండాను ఆవిష్కరించారు. లక్షలాది మంది విశ్వాసులకు భోజనాలు ఏర్పాటు చేశారు. రెవ.డాక్టర్ ఎస్.జోసెఫ్ ప్రభాకర్ అధ్యక్షతన జరిగిన ఈకార్యక్రమంలో ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య, దైవజనుడు బ్రదర్ జడ్సన్ అబ్రహం, రెవ.డాక్టర్ కె.ఎం.జాన్, సేవాభారత్ ఫౌండర్ డాక్టర్ జె.చిరంజీవి, టీసీఎఫ్ ప్రెసిడెంట్ డాక్టర్ డి.ఐజక్, టీసీఎఫ్ చైర్మన్ బిషప్ జాన్‌మార్కెండేయ, పాస్టర్ ఎం.పరంజ్యోతి, పాస్టర్ టి.డేవిడ్, బి.వినయ్‌కుమార్, రెవ.నల్ల డేవిడ్, జి.ఎలిషా, రెవ.యు.డేవిడ్, పాస్టర్ కోర్నెల్, పాస్టర్ క్లింటన్, ఇమ్మానియేల్, రెవ.డాక్టర్ జె.థామస్, సంగాల డేవిడ్, పాస్టర్లు, దేశ నలుమూలల నుంచి ప్రజలు పాల్గొన్నారు.

లైన్ పెట్రోలింగ్ నిర్వహించాలి: ఎన్పీడీసీఎల్ సీఎండీ

హన్మకొండ: అధికారులు, ఉద్యోగులు లైన్ పెట్రోలింగ్ నిర్వహించాలని టీఎస్ ఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ అన్నమనేని గోపాల్‌రావు సూచించారు. గురువారం హనుమకొండ నక్కలగుట్టలోని క్యాంపు కార్యాలయం నుంచి ఆదిలాబాద్, మంచిర్యాల, నిర్మల్, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాల ఎస్ఈలు, డీఈ, ఏఈ, ఎస్ఏఓ, ఏఓలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రగతిని సమీక్షించారు. ఇందులో సీఎండీ గోపాల్‌రావు మాట్లాడుతూ.. 33 కేవీ ఇంటర్ లింకింగ్ పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. విధిగా సబ్‌స్టేషన్ల నిర్వహణ చేపట్టాలన్నారు. దత్తత గ్రామాల్లో గుర్తించిన సమస్యలు వెంటనే పరిష్కరించాలని, పనులు పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో డైరెక్టర్లు పి.గణపతి, పి.సంధ్యారాణి, పి.మోహన్‌రెడ్డి, వి.తిరుపతిరెడ్డి, సీజీఎంలు సదర్‌లాల్, అశోక్‌కుమార్, మోహన్ రావు, రాజు చౌహాన్, రవీంద్రనాథ్, డీఈ ఐటీ అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

వనరులను ధ్వంసం చేస్తున్న ప్రభుత్వం

- మావోయిస్టు పార్టీ జేఎంఎంపీ డివిజన్ కమిటీ కార్యదర్శి వెంకటేశ్

మంథని: త్యాగాల ఫలితంగా ఏర్పడ్డ ప్రభుత్వం తెలంగాణలో ప్రజా ఉద్యమాలను అణచివేసేందుకు పోలీస్ వ్యవస్థను బలోపేతం చేస్తూ ప్రతిపక్షాలు, ప్రజా ఉద్యమాలను కాలరాస్తోందని జయశంకర్–మహబూబాబాద్, వరంగల్, పెద్దపల్లి జిల్లాల డివిజన్ కమిటీ కార్యదర్శి వెంకటేశ్ గురువారం ప్రకటనలో పేర్కొన్నారు. అధికార పార్టీ రియల్ వ్యాపారుల లాభాల కోసం కాంట్రాక్టర్లు నిబంధనలకు విరుద్ధంగా ఇసుక తీస్తున్నారని తెలిపారు. మిడ్ మానేరులో ఇసుకను తీయడంతో నీటి ఎద్దడి ఏర్పడి పంటలు పండవని కేసు వేసిన తర్వాత మైనింగ్ ఆపేసిందని పేర్కొన్నారు. అధికార పార్టీ అండదండలతో సుల్తానాబాద్, వీణవంక నుంచి గోదావరి కలిసే వరకు ఇసుకను తీసి అమ్ముతున్నారన్నారు. కాళేశ్వరం దగ్గర గోదావరిలో అక్రమంగా రోడ్డు పోసి ఇసుకను తీసుకెళ్తున్నారన్నారు. పెద్దపల్లి, జయశంకర్, ములుగు అడవులు, గుట్టలు, చెరువుశిఖం భూముల్లోని మట్టి తీసి రోడ్లు, ప్రభుత్వ భవనాలు, ఇళ్ల నిర్మాణాలకు అనుమతుల్లేకుండా కోట్లాది రూపాయలు అక్రమంగా సంపాదిస్తూ ప్రకృతిని ధ్వంసం చేస్తున్నారని స్పష్టం చేశారు.

‘నకిలీ’ ఉదంతానికి కేటీఆర్ బాధ్యత వహించాలి

- బీసీ రాజ్యాధికార సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు దాసు సురేశ్


మాట్లాడుతున్న దాసు సురేశ్

పరకాల: నకిలీ చేనేత ఉదంతాన్ని ఇప్పటికే ఖండించిన మంత్రి కేటీఆర్ నైతిక బాధ్యత వహిస్తూ మంత్రి పదవికి రాజీనామా చేయాలని బీసీ రాజ్యాధికార సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు దాసు సురేశ్ డిమాండ్ చేశారు. పరకాల చేనేత సహకార సంఘ భవనాన్ని ఆయన గురువారం సందర్శించి చేనేత కార్మికులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణలో వేల కోట్ల రూపాయల నకిలీ చేనేత దందాపై ప్రభుత్వం పట్టించుకోకపోవడం పలు అనుమానాలకు దారి తీస్తోందన్నారు. వరంగల్‌లో ఎన్‌ఫోర్స్‌మెంట్‌కు పట్టుబడిన షాపింగ్ మాల్‌ను మూసివేయించకుండా మంత్రి కేటీఆర్ వరంగల్‌కు ఎలా వస్తారని ప్రశ్నించారు. కార్యక్రమంలో డీసీసీ మాజీ జిల్లా డైరెక్టర్ గాదె శంకరయ్య, చేనేత సహకార సంఘం సభ్యులు రాజేందర్, మార్త భిక్షపతి, దాసరి భిక్షపతి పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలను అడ్డుకోవాలి

- టీఎన్జీఓస్ జిల్లా అధ్యక్షుడు రాజేందర్


సమావేశంలో మాట్లాడుతున్న ఆకుల రాజేందర్

హన్మకొండ అర్బన్: ఉద్యోగులకు కడిపికొండలో ప్రభుత్వం కేటాయించిన స్థలంలో కొందరు కబ్జాదారులు చేస్తున్న అక్రమ నిర్మాణాలను ప్రభుత్వం అడ్డుకొని, వారిపై చర్యలు తీసుకోవాలని టీఎన్జీఓస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజేందర్ డిమాండ్ చేశారు. స్థానిక ఆ సంఘం భవన్‌లో గురువారం జరిగిన యూనియన్ అత్యవసర సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు ఉద్యోగుల ఇంటి నిర్మాణాల కోసం కడిపికొండలో ప్రభుత్వం కేటాయించిన 32 ఎకరాల స్థలంలో కొందరు కబ్జాదారులు అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారన్నారు. ఈ నిర్మాణాలను వెంటనే అడ్డుకోవాలని, లేనిపక్షంలో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా నిరసన కార్యక్రమాల చేపడుతామని హెచ్చరించారు. సమావేశంలో అసోసియేట్ అధ్యక్షుడు పుల్లూరి వేణుగోపాల్, కోశాధికారి పనికెల రాజేశ్, కేంద్ర సంఘం నాయకులు శనిగరపు శ్యామ్‌సుందర్, రామునాయక్, సారంగపాణి, మొయిన్, లక్ష్మి ప్రసాద్, జిల్లా నాయకులు సలీం, చీకటి శ్రీనివాస్, రాజమౌళి, బింగి సురేశ్, రాజేశ్, ఖన్నా, రాజ్యలక్ష్మి, జయంతి, పావని, రజిత, కల్పన, రామ్‌ప్రసాద్, రాజీవ్, భరత్ పాల్గొన్నారు.

పిచ్చివాడైన కొడుకు.. తల్లడిల్లిన తల్లి హృదయం

- తట్టుకోలేక పోలీసులను ఆశ్రయించడంతో చేరదీసిన పోలీసులు
- వైద్యం ఇప్పించడంతో సాధారణ వ్యక్తిగా మార్పు


నరేశ్‌ను తల్లి సమ్మక్కకు అప్పగిస్తున్న పరకాల పోలీసులు

పరకాల: కట్టుకున్న భార్య కాపురానికి రాకపోవడంతో బాధపడుతూ కొంతకాలంగా మతిస్థిమితం లేకుండా సంచరిస్తున్న యువకుడిని చేరదీసిన పరకాల పోలీసులు వైద్యం చేయించి సాధారణ వ్యక్తిగా మార్చారు. తిరిగి ఆ యువకుడిని కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ ఘటన గురువారం చోటుచేసుకుంది. వివరాలోకి వెళ్తే.. నడికూడ మండలం రాయపర్తి గ్రామానికి చెందిన కోడెపాక నరేశ్ దంపతుల మధ్య గొడవ జరగడంతో భార్య పుట్టింటికి వెళ్లి తిరిగిరాలేదు. భార్య రావడం లేదంటూ మనోవేదనకు గురైన నరేశ్ మతిస్థిమితం కోల్పోయి గ్రామంలో సంచరిస్తూ ఉండేవాడు. కళ్ల ముందు కొడుకు అలా తిరుగుతుంటే తట్టుకోలేకపోయిన తల్లి సమ్మక్క పరకాల పోలీసులను ఆశ్రయించింది. పరకాల సీఐ పుల్యాల కిషన్ నరేశ్‌ను ఎర్రగడ్డ ఆస్పత్రిలో చేర్పించి వైద్యం అందించారు. నరేశ్ వారం రోజులకు సాధారణ వ్యక్తిగా మారాడు. ఆస్పత్రి నుంచి వచ్చిన అతడిని తిరిగి తల్లి సమ్మక్కకు అప్పగించడంతో ఆమెలో ఎనలేని సంతోషం కనిపించింది. తిరిగి తన కొడుకును ఇలా చూస్తానని అనుకోలేదని ఆమె కన్నీటి పర్యంతమైంది. ఎలాంటి సమస్య ఉన్నా పోలీసులు అండగా ఉంటారని సమ్మక్కకు సీఐ కిషన్, ఎస్ఐలు ప్రశాంత్‌బాబు, హరికృష్ణ, శివకృష్ణ ధైర్యం కల్పించారు. పరకాల పోలీస్‌స్టేషన్ పరిధిలో ఇప్పటివరకు ఆరుగురు మతిస్థిమితం లేని వ్యక్తులను ఎర్రగడ్డ ఆస్పత్రిలో చేర్పించి సాధారణ వ్యక్తులుగా మార్చి కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు సీఐ పుల్యాల కిషన్ తెలిపారు.